ఎలక్షన్ వార్ 2023

అనుదినం... జనస్వరం
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

8 పేజీలు | గురువారం 26 అక్టోబర్ 2023 | www.navatelangana.com



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి
- డీఎస్పీ వెంకటరమణ
- పారామిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్

4లో...



ఆస్పత్రికి వెళ్లాలంటే ఎడ్లబండే దిక్కు..!
- 108 వాహనానికి నోచుకోని గ్రామం
- తరాలు మారుతున్నా మార్పులేదు

5లో...

బీజేపీలో దుమారం..!

- టికెట్లు దక్కనివారిలో తీవ్ర అసంతృప్తి
- ఆ పార్టీ అధిష్ఠానం తీరుపై ఆశావహుల మండిపాటు
- కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆవేదన
- పార్టీలో కలవరం రేపుతున్న పరిణామాలు

భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లో టికెట్ల కేటాయింపు దుమారం రేపుతోంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసినా చివరకు గుర్తింపు దక్కలేదని తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. టికెట్లు దక్కినవారు సంతోషం వ్యక్తం చేయగా.. రాని వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. సూట్‌కేసులు అప్పగించిన వారికే టికెట్లు కేటాయించిందని ఓ మహిళా నాయకురాలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. బీజేపీ సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను ఏడింటిని తొలి జాబితాలో ప్రకటించింది. మంచిర్యాల, చెన్నూర్, ఆసిఫాబాద్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. కాగా ప్రకటించిన స్థానాల్లో అన్ని చోట్లా అసమ్మతి వర్గం ఉండటంతో టికెట్లు దక్కని వారు ఆ పార్టీ అధిష్టానం తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. టిక్కెట్ దక్కించుకున్న వారికి ఈ అసంతృప్త నాయకులు ఎన్నికల్లో మద్దతు తెలుపడం అనుమానంగా మారుతోంది. పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రయత్నాలు చేస్తామని ఒకరిద్దరు ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. ఆ పార్టీ అధిష్టానం అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నం చేస్తోందని తెలుస్తోంది.



అనుచరులతో కలిసి బెల్లంపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఏమాజీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు టికెట్ల కేటాయింపు అంశాన్ని కొలిక్కి తీసుకొస్తున్నాయి. తాజాగా బీజేపీ ప్రకటించిన టికెట్ల వ్యవహారం ఉమ్మడి జిల్లాలో దుమారం రేపుతోంది. పార్టీ టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు ప్రచారంతో నిమగ్నం కాగా.. దక్కనివారు పార్టీ తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తుంటడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీ అధిష్టానం తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇన్నాండ్లు టికెట్ తనకే దక్కుతుందని భరోసాతో వివిధ పార్టీ కార్యక్రమాలు చేపట్టిన ఆశావహులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. చివరకు పార్టీ టికెట్ దక్కకపోవడంతో పార్టీ వ్యవహారంపై దుమ్మెత్తి పోస్తున్నారు. సూట్‌కేసులు తీసుకొని పార్టీ టికెట్లు కేటాయించిందని తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. కొన్ని చోట్ల ఏండ్ల నుంచి పార్టీలో ఉన్న వారికి కాదని..కొత్తగా చేరిన పార్టీ టికెట్ కేటాయించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఏకంగా అభ్యర్థికి కేటాయించిన టికెట్ రద్దు చేయాలని నిరసన తెలుపడం వంటి కార్యక్రమాలు ఆ పార్టీలో

మిగతా..2లో...



కంటతడి పెడుతున్న జానుబాయి


మంత్రివర్గంలో చోటేదీ..?

- ఐదు దశాబ్దాలుగా కేబినేట్‌లో చోటు దక్కని ఎమ్మెల్యేలు
- ప్రతిసారి సిర్పూరు ఎమ్మెల్యేలకు ఆశాభంగమే

సిర్పూర్(టి) నియోజకవర్గం ఆవిర్భవించి ఎనిమిది దశాబ్దాలు గడిచిపోయింది. ఇందులో గత ఐదు దశాబ్దాలుగా ఇక్కడి నుండి గెలుపొందిన ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు దక్కడం లేదు. చివరిసారిగా 1972లో కేవీ కేశవులు మంత్రి వర్గంలో చోటు దక్కించుకోగా, తర్వాత గెలుపొందిన ఎమ్మెల్యేలు ఎవరూ కూడా మంత్రి పదవి చేపట్టలేకపోయారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు మంత్రి పదవులు దక్కుతాయని ఆశించినా వారికి భంగపాటే ఎదురైంది.



మంత్రిగా కొనసాగిన కేవీ కేశవులు



మంత్రిగా కొనసాగిన సంజీవరెడ్డి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్(టి) నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుండి 2018 వరకు మొత్తం 16సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో రాష్ట్రస్థాయిలో పేరున్న నేతలే ఇక్కడి నుండి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కాని మంత్రి పదవులను మాత్రం దక్కించుకోలేదు. ఇక్కడి నుండి గెలుపొందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కితే నియోజకవర్గం అభివృద్ధి

మిగతా..2లో...

ఆటో బోల్తా పడి గర్భిణీ మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



శిరీష(ఫైల్)

కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన మూడు నెలల గర్భిణీ అంగాల శిరీష(23) ఆటో బోల్తా పడి మృతి చెందినట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామానికి చెందిన శిరీష వివాహం చింతగూడ గ్రామానికి చెందిన అంగాల మల్లేష్‌తో ఐదు నెలల క్రితం జరిగింది. ప్రస్తుతం శిరీష మూడు నెలల గర్భిణీ. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం మంచిర్యాలలో నివాసముంటున్నారు. దసరా పండుగ సందర్భంగా తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. పండుగ తర్వాత కౌటాల మండలానికి చెందిన మేనమామ చిట్యాల సుదర్శన్ ఇంటిలో శుభకార్యం ఉన్నందున మంచిర్యాల నుంచి తండ్రి వెంకటేశ్ ఆటోలో వస్తుండగా బుధవారం సిర్పూర్ మండలం పారిగాం గ్రామ శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలోని కొంతమందికి స్వల్ప గాయాలు కాగా శిరీష్ నుదిటిపై, కాళ్లపై, పొట్టపై తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆమెను అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మరణించినట్టు నిర్ధారించారు. మృతురాలి భర్త మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

పేద విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన దండ్ల రాయుడు అనే ప్రతిభ కలిగిన పేద విద్యార్థికి మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ రూ.10 వేలు అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఇటీవల జరిగిన పీజీ ప్రవేశ పరీక్షలో సత్తా చాటి నిజాం కళాశాలలో ఎకనామిక్స్ విభాగంలో సీటు సాధించిన సదరు యువకుడి కుటుంబ ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ ఆయనకు అండగా నిలిచారు. హాస్టల్ ఫీజుల కోసం పది వేల రూపాయలను అందించారు. అత్యవసర సమయంలో తనకు అండగా నిలిచిన మున్సిపల్ చైర్మెన్‌కు విద్యార్థి కృతజ్ఞతలు తెలియజేశారు.



అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-ఉట్నూర్



అనారోగ్యంతో మండలంలోని చీమనాయక్ తండాకు చెందిన, నాగపూర్ మాజీ సర్పంచ్ జాధవ్ కొండల్‌రావ్(80) బుధవారం మరణించారు. కుటుంబ సభ్యులు తెలిసిన వివరాల ప్రకారం కొండల్‌రావ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. భౌతికాయం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కొండల్‌రావ్ నాగపూర్ సర్పంచ్‌గా పని చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు, నాగపూర్ పంచాయతీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీమనాయక్ తండాకు చేరుకున్నారు. ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. సర్పంచ్‌గా ఆయన సేవలను కొనియాడారు.

టీబీ రోగులకు తెమడ పరీక్షల శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం టీబీ అనుమానితులకు తెమడ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 19 మందిని పరీక్షించి శాంపిల్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అనుమనితులు వెంటనే పరీక్షలు నిర్వహించుకోవాలని, ప్రాథమిక దశలోనే టీబీ వ్యాధిని నివారించవచ్చని హెల్త్ సూపర్ వైజర్ చరణ్ తెలిపారు. దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రాత్రిపూట జ్వరం రావడంతో పాటు చమటలు రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. క్యాంపులో హెచ్‌ఏ బాపూరావు, ఎల్‌టీ రవీందర్, ఆశాలు గుంపాబాయి, మారుబాయి, అనిత, లక్ష్మి, అరుణ, సంగీత, శ్రీలత ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్



సోయ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం మేనేజర్ సవిత, డీటీ అమృత్‌లాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.4వేల 600 ఉన్నట్టు తెలిపారు. రైతులు సోయబీన్ తీసుకొని వచ్చేటప్పుడు వెంట పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు. రైతులు సోయ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని కోరారు. వారి వెంట సహకార సంఘం సీఈఓ అడే గణేష్, ఏఈఓ రాథోడ్ రాజేశ్వర్, సహకార సంఘం సిబ్బంది ఉన్నారు.



జైనథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని డీసీఓ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా రూ. 4600 మద్దతు ధరతో సోయా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకొని రావాలని సూచించారు. మార్కెట్‌లో సోయా విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ఆత్మరాం, సీఈఓ గంగన్న పాల్గొన్నారు.

బీజేపీలో దుమారం..!

(మొదటి పేజీ తరువాయి)

కలకలం రేపుతున్నాయి.

దక్కనివారిలో తీవ్ర అసంతృప్తి..!

బీజేపీ అధిష్టానం తొలి విడతలో ఏడు స్థానాల్లో తన అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మరోసారి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌కే టికెట్ కేటాయించింది. ఇక్కడ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి తొలి నుంచి టికెట్ వస్తుందని నమ్మకంతో ఉన్నారు. కానీ చివరకు ఆ పార్టీ అధిష్టానం మాత్రం పాయల్ వైపే మొగ్గుచూపడంతో సుహాసినిరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఉద్దేశంతో గిరిజన మోర్చ రాష్ట్ర కార్యదర్శి సాకటి దశరథ్ ప్రభుత్వ ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. బీజేపీలో చేరి గ్రామాల్లో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ టికెట్ వస్తుందని చివరి వరకు భరోసాతో ఉన్నారు. కానీ ఆ పార్టీ అధిష్టానం మాత్రం ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు సోయం బాపురావుకు బోథ్ నుంచి పోటీ చేసేందుకు టికెట్ కేటాయించింది. దీంతో సాకటి దశరథ్ తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ముధోల్ నియోజకవర్గంలో ఏడాది కిందట కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన రామారావుపటేల్‌కు ఆ పార్టీ అధిష్టానం తాజాగా టికెట్ కేటాయించింది. గత ఎన్నికల్లో పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన ఆ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవీ మరోసారి టికెట్ ఆశించారు. కానీ ఆ పార్టీ అధిష్టానం మాత్రం టికెట్ నిరాకరించింది. దీంతో ఆమె పార్టీ అధిష్టానం తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు అన్యాయం జరిగిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఖానాపూర్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. ఇక్కడ టికెట్ ఆశించిన పెంబీ జడ్పీటీసీ జానుబాయి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సూట్ కేసులు తీసుకొని పార్టీ టికెట్లు కేటాయించిందని ఆమె సంచలన ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవీకి పార్టీ టికెట్ కేటాయించగా.. ఇక్కడ తొలి నుంచి టికెట్‌పై ఆశలు పెట్టుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొయ్యల ఏమాజీ తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఆ పార్టీ అధిష్టానం తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపీలో కీలకంగా ఉన్న ఓ నేత సిఫార్సుల మేరకే టికెట్ కేటాయించారని ఆరోపించడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా శ్రీదేవీకి టికెట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తన అనుచరవర్గంతో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలపడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిర్పూర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా.శ్రీనివాస్ టికెట్ ఆశించినప్పటికీ.. పార్టీ అధిష్టానం మాత్రం పాల్వాయి హరీష్‌బాబుకు కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మల్‌లో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి టికెట్ కేటాయించగా..ఇక్కడ మాత్రం ఇతర నాయకుల నుంచి ఎలాంటి అసంతృప్తి వ్యక్తం కాకపోవడం గమనార్హం. బీజేపీలో టికెట్ల వ్యవహారం ఏ పరిణామాలకు దారితీస్తుందోనని ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మంత్రివర్గంలో చోటేదీ..?

(మొదటి పేజీ తరువాయి)

చెందుతుందని ఆశించిన ప్రజలకు, మంత్రి పదవి దక్కించుకోవాలనుకునే ఎమ్మెల్యేలకు ప్రతీ సారి భంగపాటే ఎదురవుతోంది. ఈ నియోజకవర్గం నుండి 1962, 1967లో జి సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొందారు. రెండోసారి సంజీవరెడ్డి గెలుపొందిన తర్వాత కాసు బ్రహ్మానందరెడ్డి కేబినెట్‌లో కార్మికశాఖా మంత్రిగా కొనసాగారు. 1972, 1978లో రెండుసార్లు కెవి కేశవులు గెలుపొందగా మొదటి సారి అంటే 1972లో ఎన్నికైనపుడే కేశవులు చేనేత, జౌళి శాఖామంత్రిగా జలగం వెంగళరావు కేబినెట్‌లో కొనసాగారు. ఆ తర్వాత నుండి ఈ నియోజకవర్గం నుండి గెలుపొందిన ఎవరూ కూడా మంత్రి పదవులను దక్కించుకోలేదు.

బలమైన నాయకులే ఉన్నా...

ఈ నియోజకవర్గం నుండి బలమైన నాయకులే ఎమ్మెల్యేలుగా గెలుపొందుతున్నా పరిస్థితులు అనుకూలించడం లేదు. ఎమ్మెల్యేగా గెలుపొందిన పార్టీ అధికారంలోకి రాకపోవడం, అధికారంలోకి వచ్చిన పార్టీ అభ్యర్థి ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందకపోవడం తదితర కారణాలతో నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కడం లేదు. 1983, 1985లో కేవీ నారాయణరావు తెలుగుదేశం పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనకు అప్పటి సీఎం ఎన్టీఆర్‌తో మంచి సంబంధాలు ఉన్నా చీఫ్‌విప్ పదవికే పరిమితమయ్యారు. కాని మంత్రి పదవి రాలేదు. 1989 ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కేవీ నారాయణరావు మూడోసారి గెలుపొందితే ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుందని భావించారు, కాని ఆ ఎన్నికలలో ఆయన ఓడిపోయి స్వతంత్ర్య అభ్యర్థి పురుషోత్తంరావు గెలుపొందారు. తర్వాత 1994లో కూడా కేవీ నారాయణరావు పోటీ చేసి మళ్లీ పురుషోత్తంరావు చేతిలో ఓడిపోయారు. ఈ రెండు పర్యాయాలు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే ఉండడంతో కేవీ నారాయణరావు గెలిస్తే మంత్రి పదవి వస్తుందని భావించినా ఆయన ఆశలు నెరవేరలేదు. 1989, 1994లలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన పాల్వాయి పురుషోత్తంరావు 1999 ఎన్నికలకు వచ్చే సరికి టీడీపీ టిక్కెట్ దక్కించుకొని బరిలో నిలిచారు. అప్పటికే రెండు సార్లు గెలుపొంది ఉండడం, మూడోసారి గెలిస్తే టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి పదవి ఖాయమని అనుకున్నా, అనూహ్యంగా ఆయన ఎన్నికలకు రెండు రోజుల ముందే నక్సల్స్ కాల్పులలో మరణించారు. అనంతరం ఆయన సతీమణి పాల్వాయి రాజ్యలక్ష్మి టీడీపీ నుండి పోటీ చేసి గెలుపోందినా కేవలం ఎమ్మెల్యేగా మాత్రమే ఉన్నారు. 2004లో కాంగ్రెస్ నుండి కోనేరు కోనప్ప గెలుపొందారు. కోనప్ప అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు కావడంతో రెండో సారి అంటే 2009 ఎన్నికలలో గెలిస్తే ఖచ్చితంగా మంత్రి అవుతాడని భావించారు. కాని 2009 ఎన్నికలలో కోనప్ప, టీఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్య చేతిలో ఓడిపోయారు. దీనితో కోనప్ప మంత్రి పదవి ఆశలు గల్లంతయ్యాయి. 2010 ఉప ఎన్నికలో కూడా కావేటి సమ్మయ్య టీఆర్ఎస్ నుండి గెలుపొందినా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో మంత్రి పదవికి ఆశలు లేకుండా పోయాయి. 2014లో టీఆర్ఎస్ నుండి పోటీ చేసిన కావేటి సమ్మయ్య గెలిస్తే మంత్రి పదవి వస్తుందని భావించారు. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుండి చురుకుగా పాల్గొనడం, సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు కావడం, ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఉండడంతో కావేటి సమ్మయ్యకు మంత్రి పదవి వస్తుందని భావించారు. కాని ఆ ఎన్నికలలో కావేటి సమ్మయ్య ఓడిపోయి, కోనేరు కోనప్ప గెలుపొందారు. 2018 ఎన్నికలలో టీఆర్ఎస్ నుండి కోనేరు కోనప్ప పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందినా కేవలం ఎమ్మెల్యేగానే కొనసాగారు.

c m y k

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
గురువారం అక్టోబర్, 26 2023

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-సారంగాపూర్

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్‌రామ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాంసింగ్‌తండా, కుప్తి, పోట్యా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, ఎంపీపీ అట్లా మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ దత్తురాం, అడెల్లి చైర్మెన్ చందు, మాజీ ఏఎంసీ చైర్మెన్లు రాజ్ మహ్మద్, రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ భోజారెడ్డి, సర్పంచులు రాజు, కైలాస్, రవీందర్, రాజు, నారయణ నాయక్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేపై గ్రామస్తుల నిరసన సెగ

నవతెలంగాణ-లోకేశ్వరం



ముధోల్ ఎమ్మెల్యేకు ప్రజలు గట్టిషాక్ ఇచ్చారు. గ్రామంలోకి అడుగుపెట్టకుండా పొలిమేరలోనే అడ్డుకున్నారు. తొమ్మిదేండ్లలో ఏం అభివృద్ధి చేశారో చూపించాలని నిలదీశారు. దాదాపు మూడు గంటలకు పైగా రోడ్డుపైనే నిలబెట్టి తిప్పి పంపించారు. ఈ సంఘటన నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో చోటు చేసుకుంది. ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం మండలంలోని ఎడ్దూర్-పొట్‌పెల్లి గ్రామాలకు ఎన్నికల ప్రచారం కోసం వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు వందల సంఖ్యలో గ్రామం బయటకు వచ్చి ఆయనను అడ్డుకున్నారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పని చేయలేదని, నిధులు మంజూరు చేయలేదన్నారు. దళితబంధు, బీసీబంధుకు అర్హులైన పేదలకు ఇవ్వకుండా నాయకుల అనుచరులకు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామ ప్రజలను సముదాయించేందుకు ప్రయత్నించారు. ఎడ్దూర్-పొట్‌పెల్లి గ్రామాలు ఈశాన్య మూలన ఉన్నందున ఇక్కడ నుంచి ప్రచారం మొదలుపెడితే లబ్ధి చేకూరుతుందని, అందుకే ఓట్లు అడగడానికి వచ్చానని, గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. అయినా గ్రామస్తులు శాంతించకపోవడంతో ఎమ్మెల్యేతోపాటు నాయకులు

దాదాపు మూడు గంటలకు పైగా గ్రామం బయట వేచి ఉన్నారు. అప్పటికీ ప్రజలు ఊళ్లోకి రానివ్వకపోవడంతో ఎమ్మెల్యే వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపె శ్యాంసుందర్, ఎంపీపీ లలితజోన్న, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

- భారీ పోలీసు బందోబస్తు



నవతెలంగాణ-భైంసా

భైంసాతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం దుర్గామాత నిమజ్జనోత్సవ వేడుకలు వైభవోపేతంగా సాగాయి. శోభయాత్రలో యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురాణ బజార్ దుర్గామాత మండపం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవర్ రామారావు పటేల్ పూజలు నిర్వహించారు. ప్రత్యర్థులు ఇద్దరు ఒకే చోట చేరుకొని స్టెప్పులు వేశారు. పలు ప్రాంతాల నుంచి శోభయాత్ర పంజేష చౌక్ మీదుగా కొనసాగడంతో సమస్యాత్మకమైన ప్రాంతం కావడంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ బందోబస్తును పర్యవేక్షించారు. బందోబస్తుల్లో ఎస్పీతో పాటు ఇద్దరు ఏఎస్పీలు, ముగ్గురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 27 మంది ఎస్సైలతో పాటు 500 మంది పోలీసు బలగాలను మోహరించారు. శోభయాత్ర అనంతరం దుర్గామాత విగ్రహాలను ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. పండుగ ప్రశాంతంగా జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యురాలు, పారిశుధ్య కార్మికురాలు గంగవ్వ బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గంగవ్వ సేవలు చిరస్మరణీయమని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, జిల్లా బీఆర్ఎస్ కార్యదర్శి అడ్వాల రమేష్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు జహీర్, చింతల్‌చాంద సర్పంచ్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ చిన్నయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి తక్కువ ధరకు మొక్కజొన్న ధాన్యం అమ్మ వద్దని అన్నారు. రైతులకు లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధర రూ.2090 చెల్లిస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో పీఏసీఎస్ సిబ్బంది శ్రీనివాస్, నవీన్, విష్ణువర్ధన్, సృజన్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

టికెట్లు అమ్ముకున్నారు..: జానుబాయి

- బీజేపీని నమ్మి మోసపోయాను
- భవిష్యత్‌లో ఆపార్టీకి తగిన బుద్ధి చెబుతాను
- పెంబి జెడ్పీటీసీ జానుబాయి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

బీజేపీని నమ్మి సేవలందిస్తే తనకు కాకుండా సూటికేసులు ఇచ్చిన వ్యక్తికి టికెట్ కేటాయించారని అన్నారు. తనకు బీజేపీ అన్యాయం చేసిందని పెంబి జెడ్పీటీసీ, బీజేపీ నాయకురాలు భూక్యా జానుబాయి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్ధాంతం కలిగిన పార్టీ అని నమ్మి ఆపార్టీలో చేరానని అన్నారు. కాని సిద్ధాంతాలను తుంగలో తొక్కి డబ్బులకు టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. తన కుటుంబ సభ్యులకు సైతం దూరంగా ఉండి కూడా పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తే తనకు మొండిచేయి చూపించడం ఏ మేరకు సమంజసమని కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రజల సమస్యలపై అధికార పార్టీ కేసులు పెట్టినా భయపడకుండా బీజేపీ కోసం పనిచేశానని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు లేని అర్హత ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఒక గిరిజన మహిళకు అన్యాయం చేయడాన్ని ప్రజలు ఏమాత్రం సహించరని అన్నారు. భవిష్యత్‌లో ప్రజల కోరిక మేరకు బీజేపీకి తగిన బుద్ధి చెబుతానని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గోపాల్‌రెడ్డి, అపావత్ రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పల్సి గ్రామంలో ఉన్న చిన్నపిల్లలు వినూత్నంగా నిరసన తెలిపారు. దీంతో పిల్లలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి


ఎంపీటీసీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్రం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని సిర్పూర్‌ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కోనేరు కొనప్ప అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని జీషాన్‌ ఫంక్షన్‌హాలులో మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సిర్పూర్‌ మూడో ఎంపీటీసీ సోయల్‌ హైమద్‌ బీఆర్‌ఎస్‌లోకి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేసిందని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని, అలాగే ప్రక్క రాష్ట్రమైన మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉంది. ఆ రాష్ట్రంలో చేయలేని అభివృద్ధి పనులు మన రాష్ట్రంలో చేస్తామనడం ఎంతవరకు సమంజసమని, మన రాష్ట్రంలో వృద్ధులకు, వితంతువులకు, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాల ఖర్చుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు ప్రవేశపెడితే బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఏ ఒక్క పథకాన్ని అమలుచేయలేదని విమర్శించారు. బీజేపీ నాయకులకు ముఖ్యమంత్రిని, పార్టీని దూషించడం మానుకోవాలని, తిరిగి రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్‌ సిలీండర్‌, తెల్లరేషన్‌ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి బీమా, రైతుబంధు, రైతుబీమా పెంచి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. సిర్పూర్‌ మండలంలోని చీలపెల్లి గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు అటవీ శాఖ అధికారుల వల్ల నిలిచిపోయాయని, అలాగే వెంకట్రావ్‌పేట్‌, నవెగాం మధ్య రోడ్డు కూడా వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీటీసీ సోయల్‌ హైమద్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రవేశపెట్టిన పథకాలకు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు, మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి నా వంతు కృషి చేస్తానన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-జన్నారం

రెండో రోజుల క్రితం మండలంలోని పోన్కల్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని చెక్కపల్లి కుంట చెరువు దగ్గర రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన, రాహిత్య, సాత్విక బాలికల కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడమ బొజ్జు బుధవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిని పట్టుకుని నిందితులను శిక్షించాలన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల అధ్యక్షుడు ముజఫర్‌, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, సోషల్‌ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్‌ చారీ, టౌన్‌ ప్రెసిడెంట్‌ దుమల రమేష్‌, ఫసిఉల్లా, బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు రాజన్న యాదవ్‌, వార్డ్‌ మెంబర్‌ గంగన్న యాదవ్‌, మంద రాజేష్‌, అబ్దుల్‌ ముజ్జు, రాహుల్‌, తలపెలి రాజేష్‌, బండారి స్వామి, నగేష్‌, సాయి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



బోయపల్లి గ్రామపంచాయతీలోని పోలింగ్‌ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-తాండూర్‌

మండలంలోని పోలింగ్‌ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు సంబందిల్చిఇన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై మండల కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. పోలిలంగ్‌ కేంద్రాల్లో తాగునీరు మరుగుదొడ్లు, నీడ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది ఒకరోజు బసచేసేందుకు గాను అన్ని సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు. అనంతరం కాసిపేట గ్రామపంచాయతీ డంపింగ్‌ యార్డ్‌, నర్సరీలను పరిశీలించి 2023-24వ సంవత్సరానికి గాను మొక్కలు నాటేందుకు ఎర్రమట్టి, ఇసుక ఎరువులను సమకూర్చుకొని బ్యాగు ఫిల్లింగ్‌ పూర్తి చేయాలన్నారు. శానిటేషన్‌ పనులను పరిశీలించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు పూడిక తీయాలని రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కాజీపేట పోలింగ్‌ కేంద్రంలోని సౌకర్యాలను పర్యవేక్షించి సెక్రెటరీ సాయి తేజకు పలు సూచనలు చేశారు. తాండూర్‌ ఎంపీఓ సత్యనారాయణ బోయపల్లి గ్రామపంచాయతీలోని పోలింగ్‌ స్టేషన్లను సందర్శించి పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు పలు సూచనలు చేశారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ ప్రచారం ప్రారంభం


శివ్వారంలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్‌ గణేష్‌

నవతెలంగాణ-జైపూర్‌

చెన్నూర్‌ అసెంబ్లీ నియోజకవర్గం జైపూర్‌ మండలంలో భారత రాష్ట్ర సమితి ఎన్నికల ప్రచారం మొదలైంది. సిట్టింగ్‌ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మరో సారి చెన్నూర్‌ అంసెబ్లీ టికెట్టు కేటాయించడంతో మండల పరిధిలోని గ్రామాల వారిగా ప్రచారం ప్రారంభించారు. మండల పరిధిలో స్థానిక సర్పంచులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టిన నాయకులు బీఆర్‌ఎస్‌ కొత్తగా ప్రకటించిన మెనీఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. మండల పరిధి శివ్వారం సర్పంచ్‌ ఆవిడపు గణేష్‌ నర్వ సర్పంచ్‌ రాజ్‌కుమార్‌, షెట్‌పల్లి గ్రామ పంచాయతి సర్పంచ్‌ మేడి రవితో పాటు మండల పరిధిలో గల వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ ప్రచారం కొనసాగుతోంది. సిద్దిపేట, సిరిసిల్ల మాదిరిగా చెన్నూర్‌ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మరో మారు స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని చెన్నూర్‌ నియోజకవర్గం గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఎంతగానో అభివృద్ధి చెందిందని వివరిస్తున్నారు. గత రెండు రోజులుగా గ్రామ పంచాయతీల వారిగా బీఆర్‌ఎస్‌ నాయకులు ఎన్నికల ప్రచారం కొనసాగిస్తూ స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్‌ గెలుపుకు కృషి చేస్తున్నారు.

సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలపై దృష్టి

- డీఎస్పీ వెంకటరమణ
- పారామిలిటరీ దళాల ప్లాగ్‌ మార్చ్‌

నవతెలంగాణ-రెబ్బెన

ఎన్నికల నిర్వాహణలో భాగంగా శాంతియుత వాతవరణాన్ని కల్పించేందుకు సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు డీఎస్పీ వెంకటరమణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్‌ నుంచి బస్టాండు మీదుగా దుర్గామాత దేవాలయం వరకు, దేవాలయం నుంచి పోలీస్‌స్టేషన్‌ వరకు పారామిలిటరీ దళాల ప్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. రెబ్బెన డివిజన్‌ పరిధిలో నవంబర్‌ 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎలక్షన్‌ కమీషన్‌ సూచించిన గైడెన్స్‌ ప్రకారం విధులు నిర్వహించాలని, రాబోయే ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఎవరైన చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలంతా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామం, జిల్లా అభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా వర్గ విబేదాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేల సహకరించాలని, ఒకరికొకరు కలిసిమెలిసి సామరస్యంగా ఉండాలని తెలిపారు. ప్రజలంతా ఎలక్షన్‌ సమయంలో పోలీస్‌ వారికి



సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐ అల్లం నరేందర్‌, ఎస్సై చంద్రశేఖర్‌, పారామిలిటరీ దళాలు పాల్గొన్నారు.

సినీ, టీవీ కళాకారులకు ఉచిత వర్క్‌ షాప్‌

నవతెలంగాణ-ఆసిఫాబాద్‌

నవజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆసిఫాబాద్‌ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఆదివారం ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో చలనచిత్ర, టీవీ రంగాల్లో స్థిరపడాలనుకుంటున్న ఔత్సాహికులైన కళాకారులు, రచయితలు, సాంకేతిక నిపుణులకు ఉచిత వర్క్‌ షాప్‌ను నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మపురి వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినీ, బుల్లితెర రచయిత, నటుడు, దర్శక, నిర్మాత,13 నంది అవార్డులు తీసుకున్న తెలుగు టెలివిజన్‌ ఫెడరేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ నాగబాల సురేష్‌ కుమార్‌ పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో యువ దర్శకుడు మానస్‌ పాల్గొంటారని, శిక్షణ పొందాలనుకున్న జిల్లా కళాకారులు, రచయితలు సాంకేతినిపుణులు తమ పేర్లను దిగువ పేర్కొన్న చరవాణి నెంబర్లలో నమోదు చేసుకోవాలని దీని కోసం 9866645822, 8639877657, 9490918014, 8555086389 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లాలంటే ఎడ్ల బండే దిక్కు..!

• 108 వాహనానికి నోచుకోని గ్రామం

మండల కేంద్రానికి 18కిలో మీటర్ల దూరంలో ఉన్న ఓ కుగ్రామం బాబ్జిపేట్. ఆ గ్రామానికి వెళ్లాలంటే కాలినడకే శరణ్యం. ఇప్పటికీ ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. స్వాతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ వెనుకబడి ఉన్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు కనీస సౌకర్యాలైన విద్యా, వైద్యం, రోడ్డు, విద్యుత్, వసతులు కల్పించకపోవడమే దీనికికారణమని పేర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే తమ గ్రామానికి వెళ్లాలంటే నరకమేనని అంటున్నారు. ప్రత్యేకంగా చెప్పాలంటే అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రికి వెళ్లాలంటే ఎడ్ల బండే దిక్కువుతోంది. కనీసం గ్రామానికి 108 వాహనం రాలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారిన తమ గ్రామ సమస్యలు మాత్రం యధావిధిగా ఉన్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం చంద్రుడిపైకి వెళుతున్న తరుణంలో కనీసం 18కిలో మీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఏ వాహనం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ-ఇచ్చోడ



తరాలు మారుతున్నా మార్పు లేదు...

బాబ్జిపేట్ గ్రామపంచాయతీ పరిధిలో ఐదు అనుబంధ గ్రామాలతో ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీని ఏర్పాటు చేసింది. దశాబ్దాలుగా ఆ గ్రామాల్లో తాతలు, ముత్తాతలు ఎదుర్కొంటున్నా సమస్యలను నేటి తరం వారు కూడా ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. బాబ్జిపేట్ గ్రామపంచాయతీలో సోమన్నగూడ, గోండుగూడ, లంబాడితండా, బొజ్జుగూడ, శివగూడ గ్రామాలున్నాయి. మండల కేంద్రానికి 18కిలో మీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంటుంది. సిరిచెల్మ గ్రామం గుండాల ఎక్స్‌రోడ్డు వద్ద నుంచి వెళ్లాలి. వర్షాకాలంలో రహదారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. కనీసం ద్విచక్ర వాహనం కూడా నడవలేని పరిస్థితి ఉంటుంది. గ్రామంలో ఎవరైనా జబ్బు బారిన పడితే ఎడ్ల బండే దిక్కు. అందులో 12కిమీ దూరంలో ఉన్నా ఆరోగ్య కేంద్రం రావాల్సి ఉంటుందన్నారు. లేదా 8కిలో మీటర్ల దూరంలో ఉన్న సిరిచెల్మ గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. 108 వాహనం ఒక్కసారి కూడా ఆ గ్రామానికి వెళ్లలేదు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో రోడ్డు కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. త్రీపేజ్ కరెంట్ సౌకర్యం లేదు. కడెం వాగు గ్రామ సమీపం నుండి ప్రవహిస్తున్నా త్రీఫేజ్ కరెంట్ లేక కండ్ల ముందే చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నా రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. పంట దిగుబడులు రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. ఉన్న వన్ ఫేజ్ విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా మారాయి. పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఫ్లోరైడ్ నీటితో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

ఐదు గ్రామాల్లో 4 చేతిపంపులు మాత్రమే ఉన్నాయి. అందులో రెండు బోర్లలో ఫ్లోరైడ్ నీరు ఉంది. ఆ నీరు తాగి అక్కడి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు ట్యాంకుల వరకు వస్తున్నా ఇంటింటికి నల్లాల ద్వారా రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దిక్కు లేని పరిస్థితిలో ఫ్లోరైడ్ నీటినే తాగాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

ఎడ్ల బండే దిక్కు : గుండాల రమేష్



బాబ్జిపేట్ గ్రామంలో ఎవరైన అనారోగ్యానికి గురైతే అత్యవసర పరిస్థితుల్లో ఎడ్ల బండే దిక్కువుతోంది. గ్రామానికి ఇప్పటి వరకు 108 వాహనం రాలేదు. అంటే గ్రామ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వర్షాకాలంలో అయితే ఎడ్ల బండి కూడా రాలేని విధంగా రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడతాయి. పాలకులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలి.

త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి : దేవ్‌రావ్



గ్రామంలో 99శాతం మంది వ్యవసాయమే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నారు. గ్రామ సమీపంలో నుంచి కడెం నది వాగు ప్రవహిస్తోంది. కానీ త్రీఫేజ్ కరెంట్ లేక కండ్ల ముందు చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్న ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. నీరు ఉన్నా వాటిని వాడుకోలేకపోతున్నాం. దిగుబడి రాక రైతులకు అప్పులే మిగుతున్నాయి. ఇప్పటికైనా గ్రామానికి త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి.

గిరిజన యువత క్రీడా పోటీల్లో రాణించాలి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్



నవతెలంగాణ-బేల

గిరిజన యువత క్రీడా పోటీల్లో రాణించి తమ ప్రతిభతో దేశానికి మంచి పేరు తీసుకురావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో కుమురంభీం 83వ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల పోరాట యోధుడు కుమురంభీం 83వ వర్ధంతి సందర్బంగా గ్రామ యువకులు టీఏజీఎస్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గిరిజన యువత భీం స్ఫూర్తిగా క్రీడా పోటీల్లో రాణిస్తూ ఆదివాసీ గ్రామాలకు పేరు ప్రఖ్యతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, గ్రామ అధ్యక్షులు సంతోష్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి), పల్సి, సొనారి, పార్డి(కె)తో పాటు మలేగాం తదితర గ్రామాల్లో బుధవారం దుర్గమాత నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్డి(బి) గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది. గ్రామంలో ఉన్న ఆదిత్య యువజన సభ్యులు దుర్గమాత మాల ధరించి 9రోజుల పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. చివరి రోజున మంగళ వాయిద్యాలతో ఆయా గ్రామంలో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో దుర్గమాత నిమజ్జనం చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా కుభీర్ ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

లోకేశ్వరం : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు మండలంలోని జోహార్‌పూర్ గ్రామంలో ఘనంగా ముగిసాయి. త్రినేత్ర దుర్గామాతగా కొలువు దీరిన అమ్మవారు దసరా నవరాత్రుల్లో విశేష పూజలందుకున్నారు. దేవీ మాత విగ్రహ నిమజ్జన ఘట్టం చివరి రోజైన బుధవారం అమ్మవారికి ఉత్తర పూజలు నిర్వహించి నృత్యాలు, మేళతాళాలతో విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిగంబర్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



పంట విక్రయంలో దళారులను నమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రైతులు దళారి చేతిలో పెట్టి మోసపోవద్దని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. బుధవారం మార్క్‌ఫెడ్ ద్వారా గూడిహత్నూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళుకేంద్రాన్ని మార్కెడ్ యార్డులో ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవి ముఖ్య అథితిగా హాజరై తూకం వేసి కొనుగోళుప్రక్రియను ప్రారంభించారు. అనంతరం తొలి రైతును సత్కరించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలుకు రూ.4,600తో కొనుగోళ్లు



చేపడుతున్నామన్నారు. రైతులు దళారులు, ప్రయివేట్ వారిని ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందేందుకు కొనుగోళుకేంద్రాల్లోనే సోయాను విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ : మండలకేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో సోయా, మొక్కజొన్న పంటల కొనుగోళు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ ద్వారా సోయకు రూ. 4600, మొక్కజొన్నకు రూ. 2090 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ రైతులు పంటలను శుభ్రపరచి తెమ లేకుండా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి దేవన్న, ఏఓ విశ్వమిత్ర, సొసైటి కార్యదర్శులు గోలి స్వామి, నాగభూషణం పాల్గొన్నారు.

ఇచ్చోడ : రైతులు పండించిన సొయా పంటను తెలంగాణ రాష్ట్ర మార్క్‌షఫెడ్ ద్వారా ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సొయా కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన సొయా పంటను ప్రయివేట్ వారికి అమ్మి మోసపోవద్దని చైర్మెన్ సూచించారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేష్, సిబ్బంది సాయి, దాము, రైతులు సతీష్ రెడ్డి, మల్లయ్య, పురుషోత్తం, కైలాష్ పాల్గొన్నారు.

c m y k

రైళ్ల తనిఖీల్లో మద్యం స్వాధీనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో అధికారులు

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఢిల్లీ నుండి వైజాగ్ వెళుతున్న ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనమైనట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన ఈ తనిఖీలో 52 మద్యం సీసాలు (750 ఎంఎల్) లభ్యమయ్యాయని, వీటిని తరలిస్తున్న బగాడి రమణమూర్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆమె వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌తో పాటు టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నట్లు ఆమె వివరించారు.

ఈవీఎంలపై సెక్టార్ అధికారులు అవగాహన కలిగి ఉండాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం మాస్టర్ ట్రైనర్లచే సెక్టార్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని, సెక్టార్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని, ఈవీఎం, వివి ప్యాట్లు, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాలలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకొని ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి ఎన్నికల రోజున తగు సూచనలు అందించాలని సూచించారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు, ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసిల్దార్లు, పోలీస్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈవీఎంలలో సమస్య తలెత్తితే రిజర్వు ఈవీఎంలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే శిక్షకులచే నివృత్తి చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్, మకోడి రైల్వేస్టేషన్‌ల మధ్య నవెగాం గ్రామ సమీపంలో గల రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(40)పైన వయస్సు ఉంటుందని జీఆర్‌పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపుకు వెళ్లే గుర్తు తెలియని రైలుకు పడి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు బ్లాక్, బ్లూ, వైట్ లైనింగ్ గల ఫుల్ షర్టు, లైట్ బ్లూ కలర్ జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో బద్రపరిచినట్లు, వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు జీఆర్‌పీఎస్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

కుమురంభీం గ్రహావిష్కరణ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని దాబా గ్రామంలో కుమురంభీం విగ్రహావిష్కరణ మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ నాయకురాలు సరస్వతిలు హాజరయ్యారు. భీం ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరు సాగాలని సూచించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈకార్యక్రమంలో వాంకిడి జడ్పీటీసీ అజయ్ కుమార్, సవాతి సర్పంచ్ దేవ్‌రావు, దాబా సర్పంచ్ కొట్నాక జంగుబాయి, గిరిజన సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం, తల్లీబిడ్డ క్షేమం

నవతెలంగాణ-కౌటాల

చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన జుమ్మి లావణ్య మంగళవారం రాత్రి 108 వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు 108 ఈఎంటీ పిట్టల విజయ్, పైలట్ కొండపర్తి సుభాష్‌లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానపల్లి మండల కేంద్రానికి చెందిన లావణ్య పురిటి నొప్పులతో మంగళవారం కౌటాల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆమెను కౌటాల నుంచి కాగజ్‌నగర్ ప్రభుత్వ దావకానకు 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న క్రమంలో మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిర్పూర్ మండలం పెద్ద బండ వద్ద అంబులెన్స్‌ఆపి చికిత్స చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. లావణ్యకు ఇది మూడవ కాన్పు కాగ తల్లి బిడ్డను ఇద్దరినీ సామాజిక దావకానకు తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని వారు పేర్కొన్నారు. సమయ స్పూర్తితో చికిత్స అందించి ప్రసవం చేసిన 108 సిబ్బంది విజయ్ సుభాష్‌లను లావణ్య కుటుంబీకులు పలువురు అభినందించారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌ఓ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

- సిబ్బంది పనితీరు మార్చుకోవాలని హితవు
- రికార్డులు సక్రమంగా మెంటెనెన్స్ చేయాలని సూచన
- సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటాం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ తుకారాం బట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించి ల్యాబ్‌లోని టెస్టుల విధానం ఎలా చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు రికార్డులు మెంటెన్ చేస్తున్నారా అని పరిశీలించారు. వారంలో ఒకరోజు సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి సూచనలు అందించాలని డాక్టర్ అవినాష్‌కు సూచించారు. రికార్డుల సక్రమంగా ఉంచాలని, రికార్డులు ఏ విధంగా మెంటెన్ చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ బాధ్యతలను పూర్తిగా పీహెచ్‌ఎన్నే వహించాలని సూచించారు. పీహెచ్‌ఎన్ వైద్యశాలలో లేకపోవడంతో ఫోన్ చేసి ఆమె ఎక్కడుందని ఆరా తీశారు. పీహెచ్‌ఎన్ వైద్యశాలకు సక్రమంగా వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో డాక్టర్ కొరత ఉందని, డాక్టర్‌ను, సిబ్బందిని నియమించాలని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా జిల్లాలో 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇందులో 20 మందిని నియమించుకోవడానికి ప్రభుత్వం అనుమతించగా గత రెండు నెలల్లో నోటిఫికేషన్ ఇవ్వగా ఆరుగురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మరో విజిట్‌లో ఎలాంటి పొరపాట్లు ఉండొద్దని, అలా ఉంటే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. మందుల స్టాక్ ఏ క్రమంలో ఉంచుతున్నారని, దానికి సంబంధించిన రికార్డులను ఎలాంటి మెంటెన్ చేస్తున్నారని ఫార్మాసిస్టును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ అవినాష్, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-బెజ్జూర్

ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా పారామిలిటరీ సిబ్బందితో కవాతు చేపట్టారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి సమాచారమైన ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. గొడవలకు తావులేకుండా ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ సాదిక్‌పాషా, ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన గుల్లాయి సంబరాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గుల్లాయి పండుగ సంబరాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని భీంనగర్ కాలనీలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం దసరా తర్వాత గుల్లాయి పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకుంటారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పాల్గొని ఉత్సాహంగా జరుపుకుంటారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-కౌటాల



దసరా, బతుకమ్మ సంబరాలు బుధవారంతో ముగిశాయి. మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లో దసరా పండుగను సోమవారం, మరికొన్ని గ్రామాల్లో మంగళవారం జరుపుకున్నారు. అయితే సద్దుల బతుకమ్మలు కొన్ని గ్రామాల్లో జరుపుకోగా మరికొన్ని గ్రామాల్లో దసరా పండుగ రోజే బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. మండలంలోని ధనుర్‌హెట్టి, మొగడ్‌దగడ్, కౌటాల, వీర్దండి తదితర గ్రామాల్లో దసరా, బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. మండలంలోని ధనుర్‌హెట్టి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి నుండి బతుకమ్మ ఆటలు ప్రారంభించి బుధవారం ఉదయం 10 గంటల వరకు అంగరంగ వైభవంగా సంబరాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను సాంప్రదాయ ఆటపాటలు ఆడినంతరం గ్రామ శివారులోని వార్దా నది వాగుల్లో, చెరువుల్లో, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించుకోవాలని మంచిర్యాల డీసీపీ రామ్నాథ్ కేకన్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోనిలో తొర్రే గిరిజన గ్రామంలో గిరిజనులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తులకు తావివ్వకూడదన్నారు. కార్యక్రమంలో గిరిజన గ్రామస్తులు మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్షెట్టిపేట సీఐ కృష్ణ ఎస్సై పి. సతీష్, పోలీసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీదేవి ఎమ్మెల్యే టికెట్ రద్దు చేయాలని రాస్తారోకో

నవతెలంగాణ-కాసిపేట

భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవి పేరును మార్చాలని బీజేపీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం తనకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం కాసిపేట మండలంలోని సోమగుడెం ప్రధాన రహదారిపై బీజేపీ మద్దతుదారులతో కలిసి రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా ఏమాజి మాట్లాడుతూ తాను గత ఎనిమిది సంవత్సరాలుగా బెల్లంపల్లిలో ఉంటూ ప్రజల కోసం పని చేస్తున్న తనకు టికెట్ ఇవ్వకుండా పార్టీ రాష్ట్ర నాయకత్వం అన్యాయం చేసిందని తెలిపారు. గత నెల రోజుల క్రితం బీజేపీలో చేరిన శ్రీదేవికి ఏ విధంగా టిక్కెట్ కేటాయిస్తారని ప్రశ్నించారు. పార్టీ అధిష్టానం పునరాలోచించాలని, ఆమె పేరును మార్చి తనకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని కళ్మలపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ సీపెల్లి అంకులు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సీపెల్లి శ్రీనివాస్, యువ నాయకులు గాండ్ల మల్లేష్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కోలి వేణుమాధవ్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీ కాంత్, రుద్రభట్ల లక్ష్మీ నారాయణలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి గ్రామ ఉపసర్పంచ్ నఫీజా బేగం, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు హమీద్ ఖాన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

నవతెలంగాణ-జన్నారం

చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలపాలని ఎంపీటీసీ మమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జాన్సన్ నాయక్‌ను 50వేల మెజారిటీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై పని చేయాలన్నారు. కార్యకర్తలు సమిష్టిగా ఐకమత్యంతోనే పనిచేస్తే 50 వేల మెజార్టీ ఖాయం అన్నారు.

అవకాశాలు యువత సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కెరమెరి

యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దేవాపూర్ గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని దేవాపూర్ గ్రామం నుండి ఉజ్వల్ యాదవ్, రాథోడ్ ప్రవీణ్ కుమార్ కానిస్టేబుల్ ఉద్యోగం, నీట్‌లో ప్రతిభ కనబరిచి సీటు సంపాదించిన చవాన్ కృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామం నుండి యువత ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత మంది వీరిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జాదవ్ వసంతరావు, ఉపాధ్యక్షుడు రాథోడ్ ప్రేమ్‌సింగ్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణను కాపాడుకుందాం

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల ఐక్యతకు మైలు రాయిగా నిలిచిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో కేసీఆర్ నియంతత్వ పాలనపై మరో పోరాటం చేసి తెలంగాణను కాపాడుకుందాం అని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను వంచిస్తున్నాడని, అమరుల త్యాగాలను ఉద్యమ ఆకాంక్షలను మరిచి అక్రమ సంపాదన ఆధిపత్య రాజకీయాలకు తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, నిరుద్యోగ యువకుల ఆత్మహత్యలకు కేసీఆర్ కారకుడయ్యాడని తన ఎన్నికల ప్రయోజనాలకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చి, లక్షల అప్పుచేసి రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు.

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజహిద్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంపూర్ గ్రామానికి చెందిన భీమనవేని నారాయణ(65) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో దులానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కాళేశ్వరంతోనే ఉమ్మడి ఆదిలాబాద్ ఎడారిగా మారింది

- డా.ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్
- కాంట్రాక్టుల్లో కమీషన్ల కోసమే ప్రాణహిత-చేవెళ్ల రీడిజైన్



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంతోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎడారిగా మారిందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని నందికొండ, బాబాపూర్, లంబాడిహెట్టి, రణవెల్లి, బూరవెల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టుల్లో కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ నాసిరకంగా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని ఆరోపించారు. సిర్పూర్ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.900 కోట్లు ఖర్చు చేసి భూసేకరణ పూర్తైనా ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. నియోజవర్గంలోని తుమ్మిడిహెట్టి, సాండ్‌గాం, రణవెల్లి, కోర్సిని, గూడెం ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేయడంలో కేసిఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. గిరిజనులు సాగు చేసుకునే పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు నష్టపరిహారం అందక దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి కేసీఆర్ అవినీతి, అక్రమాలను బయటపెడతామన్నారు. గత ఎన్నికల్లో నకిలీ బంగారు, ఉంగరాలు పంచిన ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఓడించాలని అన్ని గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా బీఎస్పీకి ఓటేస్తామని తీర్మాణాలు చేయాలని కోరారు. ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన కోనేరు కోనప్ప అరాచకాలు సిర్పూర్ గడ్డపై పోవాలంటే వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, విజయ నిర్మల, జిల్లా కోశాధికారి నవీన్, మోర్ల గణేష్, రాంప్రసాద్, అసెంబ్లీ అధ్యక్షులు డోకే రాజన్న, నీలా గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాల్లో గుబులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాల గుండెల్లో గుబులు మొదలైందని డీసీసీబీ చైర్మెన్ అడ్డిభోజారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బీమా పథకం ప్రతి ఇంటికి ధీమా కల్పిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, పెన్షన్లు ఇతర వాటితో అన్ని వర్గాల వారిని ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష కాంగ్రెస్ మాత్రం కర్ణాటక పథకాలను గొప్పగా అభివర్ణిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కర్ణాటకలో పరిస్థితి గందరగోళంగా మారిందని వివరించారు. ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో రూ 4,500 కోట్లతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పురుషోత్తం, యాదవ్, గంగాధర్ పాల్గొన్నారు.

మద్యం సీజ్ : నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్ టౌన్ : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపడుతుండగా ఇద్దరు మద్యం అమ్ముతుండగా పట్టుపడ్డారు. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన దేవిదాస్ వినాయక చౌక్‌లో పట్టుబడ్డారు. అతని వద్ద నుంచి 22 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మద్యం విలువ రూ.24 వేల 200 ఉన్నట్లు తెలిపారు. అలాగే అంబెడ్కర్ నగర్‌కు చెందిన కాంబ్లే లఖన్ ఎన్టీఆర్ చౌక్‌లో మద్యం అమ్ముతుండగా పట్టుబడినట్టు తెలిపారు. అతని వద్ద 5 లీటర్ల మద్యం సీజ్ చేయగా, దాని విలువ రూ.5 వేలు ఉంటుందన్నారు. నిర్వహకులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై ఉదయ్ కుమార్ ఉన్నారు.

తిమ్మాపూర్‌లో ఘనంగా దసరా

జన్నారం : దసరా పండగ సందర్భంగా మంగళవారం సాయంత్రం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సీతారామచంద్ర సామి ఆలయ స్వమీపాన ఉన్న షమీ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ జాడి గంగాధర్, ఎంపీటీసీ వెంకటస్వామి హైకోర్టు మాజీ ఏజీపీ రాజేష్ నేత, మాజీ ఎంపీటీసీ కమ్మల భూమయ్య, గ్రామ పెద్దలు కలిసి శమీచెట్టుకు పూజలు చేశారు.

నేత్రపర్వంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ప్రతిష్ఠించిన శారదా దేవి నిమజ్జన శోభయాత్రను బుధవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. డీజే చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. ముందుగా శారదా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. మహిళలు ఒకే రంగు దుస్తులతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న సతీమణి జోగు రామ, మున్నూరు కాపు సంఘం మహిళలు, యువతులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : పట్టణంలో దుర్గమాత అమ్మవారి శోభయాత్ర బుధవారం కన్నుల పండుగగా సాగింది. దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజులు పూజలందుకున్న దుర్గామాతను మంగళ హారతులతో భక్తులు సాంప్రదాయంగా గంగానదికి తరలించారు. శోభయాత్రలో ప్రత్యేకంగా మహిళల ఆటపాటలు, కోలాటాలతో నిమార్జనానికి సాగనప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మట్కా జూదారుల అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని చాందా బ్రిడ్జి వద్ద మట్కా జూదారులను సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ డి.సాయినాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. చాందా బైపాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి నలుగురు ఉండగా అందులో ఇద్దరిని పట్టుకున్నారు. ఇద్దరు పరారైనట్టు ఇన్స్‌పెక్టర్ సాయినాథ్ తెలిపారు. అశోక్, ఫిరోజ్ ఖాన్‌లను పట్టుకొని వారి వద్ద నుండి రూ.20,200 నగదుతో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

c
m
y
k

కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదు

• బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-తలమడుగు

65 ఏళ్ల పాలించిన బీజేపీ, కాంగ్రెస్‌లు ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఆ పార్టీలకు ప్రజల వద్దకు వచ్చి ఓటు అడిగే హక్కు లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి సుంకిడి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్‌తో కలిసి బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ ర్యాలీ దేవాపూర్ ఎక్స్ రోడ్ నుండి దేవాపూర్, బరంపూర్, అర్లీ-కే, రుయ్యాడి, తలమడుగు, కొత్తూర్ కొత్తూరు, సుంకిడి మీదుగా ఉండం గ్రామానికి చేరుకుంది. అంతకు ముందు సుంకిడిలో అనిల్ జాదవ్‌ను పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతించారు. అనంతరం ఉండం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ 65 ఎండ్లు పాలించి ఎలాంటి అభివృద్ధి చేయని కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో ఉన్నారన్నారు. న్యాయానికి, ధర్మానికి జరుగుతున్న ఈ పోరాటంలో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. బీజేపీ హయంలో రూ. 400 ఉన్న సిలిండర్ ధరను రూ.1200కు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలన్నారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే రూ.400 కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలతో పాటు మేనిఫెస్టో గురించి వివరించాలన్నారు. బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ మాట్లాడుతూ గెలిచిన తరువాత మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఖోడద్ గ్రామ మహిళలతో కలిసి జోగు రామన్న, అనిల్ జాదవ్‌లు బతుకమ్మ ఆడి ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి నగేష్, డీసీసీబీ చైర్మెన్ అడ్డిభోజారెడ్డి, జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు పిడుగు సంజీవరెడ్డి, కటిపల్లి వసంతరెడ్డి, కిరణ్ కుమార్, అబ్దుల్లా, కేదరేశ్వర్ రెడ్డి, రమాకాంత్, ప్రభాకర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

నవతెలంగాణ-తాంసి

జ్వరంతో నాలుగేళ్ల బాలిక మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని పొన్నారిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. పొన్నారి గ్రామానికి చెందిన ఈదపు మహేందర్, లావణ్యల దత్తపుత్రిక ఈదపు దేవిశ్రీ(4) రాంపూర్‌లోని ప్రయివేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. నాలుగు రోజులుగా జ్వరం రాగా ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స అనంతరం వైద్యులు డిశ్చార్జి చేశారు. మంగళవారం మళ్ళీ రాత్రి తీవ్ర జ్వరం రావడంతో పాటు వాంతులు, విరోచనాలు చేసుకోవడంతో రిమ్స్‌లో చేర్పించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. మహేందర్ దంపతులకు పిల్లలు లేకపోవడంతో తన తమ్ముని కూతురుని దత్తత తీసుకొని పెంచుకున్నాడు. బాలిక మృతితో కుటుంబం, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న తరపున మున్సిపల్ చైర్మెన్‌జోగు ప్రేమేందర్ ప్రచారం ప్రారంభించారు. బుధవారం పట్టణంలోని రిక్షాకాలనీలో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను వివరించారు. ప్రజలను కలుస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు తమ పార్టీ పక్షాన అండగా నిలుస్తున్నామని, పదేళ్ళ కాలంలో అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల సరళిని వివరిస్తూ కారు గుర్తు స్టిక్కర్లను అతికించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఆవుల వెంకన్న, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు శివకుమార్, ఇబ్బు ఉన్నారు.

ఆదివాసుల అభివృద్ధి డీఎస్పీతోనే సాధ్యం



డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న అగ్గిమల్ల గణేష్ మహారాజ్

• డీఎస్పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆదివాసీల అభివృద్ధి ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ)తోనే సాధ్యమని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లాకు చెందిన గిరిజన ఆదివాసీ సంఘం నాయకులు ఉయికే ఉమేష్, జుగ్నక్ రమేష్, మాడవి నాగేష్, మిశ్రం రామకృష్ణ, దుర్వా భీమ్‌రావ్, మేస్రం సోమన్న, మాడవి ఇస్తారి, ఆత్రం సుంగన్న పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జిల్లా అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని, వేల ఏండ్లుగా అణగారిన వెనుకబడిన కులాలను అగ్రకులాలు దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో దోపిడి గురవుతున్న కులాలను చైతన్యం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నూతనంగా చేరిన సభ్యులను జిల్లా డీఎస్పీ కార్యవర్గ సభ్యులుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండమడుగు గణేష్, బడుగు రాజేశ్వర్, అగ్గిమల్ల నవీన్, అన్నేల లక్ష్మణ్, విద్యార్థి విభాగం నాయకులు రఘువీర్, ప్రవీణ్, ధర్మ శేఖర్, రాజేశ్వర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

28న హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలి

• ఎమ్మెల్సీ దండె విఠల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 28న మండల కేంద్రంలోని ఎంపీడీఓ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు రానున్నరని, సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దండేవిఠల్, ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ కోరారు. ఎంపీడీఓ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు లక్కారంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎంపీపీ పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి హరీష్ రావు ఉట్నూర్‌కు రానున్నారని ఎమ్మెల్సీ తెలిపారు. పార్టీ కార్యకర్తలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సీతారాం, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, నాయకులు రషీద్, భరత్, అన్సారీ ఉన్నారు.

మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పేదల సంక్షేమమే పరమావధిగా పథకాలు, సుపరిపాలన అందిస్తున్న కేసీఆర్ మూడవ సారి సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్యే జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముందుగా దుర్గానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాకాల్ అజయ్‌తో పాటు పలువురు చేరాగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు సూరం అనిల్, విశ్వంబర్, అలీంతో పాటు యువకులు, మహిళలు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే జోగు రామన్న నివాసంలో బంగారిగూడకు చెందిన సంతోష్, విజయ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, మహిళలు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలలో కాంగ్రెస్, బీజేపీలు పెట్టిన సంక్షోభాన్ని దూరం చేసేలా సంక్షేమ పథకాలను మహిళలకు అందించి వారికి అండగా నిలిచామని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో రూ.400కే గ్యాస్, సౌభాగ్య లక్ష్మితో ప్రతి మహిళకు రూ.3000, అమ్మఒడి, తల్లితో పాటు కడుపులో బిడ్డ సంరక్షణకు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కారు గుర్తు పార్టీని ప్రతి ఒక్కరు ఆదరించి మూడవసారి అధికారంలోకి వచ్చేల భాగస్వామ్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, జిల్లా ఉపాధ్యక్షులు ఇజ్జగిరి నారాయణ, మైనార్టీ నాయకులు సలీం, బీసీ సెల్ నాయకులు దాసరి రమేష్ పాల్గొన్నారు.